మొదలైన ఇంటర్ తరగతులు

- జిల్లాలో మొత్తం 138 జూనియర్ కళాశాలలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు




నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఇంటర్మీడియెట్ కళాశాలలు మంగళవారం పునఃప్రారంభ మయ్యాయి. పదవ తరగతి అనంతరం ఇంటర్‌లో చేరిన విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. అయితే రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండు తుండడంతో విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది. 2025-26 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు ఇంతకు ముందే విడుదల చేసింది.

జిల్లాలో కళాశాలల..

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 138 కళాశాలలున్నాయి. 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ కళాశాలలో 19, కేజీబీవీలు 27, సోషల్ వెల్ఫేర్ 6, ట్రైబల్ 3, బీసీ వెల్ఫేర్ 3, హైస్కూల్ ప్లస్‌లు 5, ప్రైవేటు కళాశాలలు 57 ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 20,051 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 9,090 మంది ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యను అభ్యసిస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలు..

మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబులు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా బోధన, హాస్టల్ వసతి తదితర వాటితో పాటు ఇంటర్ విద్యతో భవిష్యత్‌లో లభించే అవకాశాలను వివరిస్తున్నారు.

235 పనిదినాలు..

ఇంటర్మీడియెట్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌ను ఏప్రిల్‌లోనే విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. నూతన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో 235 పనిదినాలు ఉంటాయి. మొత్తం 314 రోజులకు 79 రోజులు సెలవు దినాలున్నాయి. జూలై 17 నుంచి 19 వరకు యూనిట్-1, ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2, సెప్టెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయి. అక్టోబరు 22 నుంచి 24వ తేదీ వరకు యూనిట్-3, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సర పరీక్షలు, డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. జనవరి 21 నుంచి 28 వరకు ప్రీ ఫైనల్ -2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పబ్లిక్ పరీ క్షలు ఉంటాయని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి వచ్చే ఏడాది మార్చి 18 చివరి పనిదినంగా నిర్ణయించారు.

అవగాహన కల్పిస్తున్నాం



కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాం. ఈ అంశంపై ఇప్పటికే అన్ని కళాశాల ప్రిన్సిపాళ్లకు, అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశాం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి కళాశాలల వసతుల గురించి వివరించడంతో పాటు కళాశాలలో చేరే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కోర్సుల వివరాలు, తదితర వాటిపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి.
– శంకర్‌నాయక్, డీఐఈఓ, నంద్యాల

క్లుప్తంగా

రుచికరమైన భోజనం వడ్డించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నాగార్జున రెడ్డి

శిరివెళ్ల: డొక్కా సీతమ్మ స్ఫూర్తితో విద్యార్థులకు రుచికరమయిన భోజనం వడ్డించాలని ఎంఈఓ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు భోజనం, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. వంట శాలలో పరిశుభ్రత పాటించాలని, వంట నాణ్యతగా ఉండాలన్నారు. ఆహార భద్రత, సమతుల్య పోషణ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వెంకట లక్ష్మమ్మ వంట, నాణ్యతపై ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీలు అన్సర్, గుర్రప్ప, పుల్లయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



యోగాసనాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : యోగాసనాలతో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కూడా పదిలంగా వుంటుందని మండల విద్యాశాఖాధికారి-1 రఘురామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మోడల్‌స్కూల్‌లో మండల పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి యోగాసనాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విధి నిర్వహణలో ఒత్తిళ్లకు గురి కాకుండా యోగాభ్యాసాలు ప్రతి రోజు పాఠశాలలో ఉదయం విద్యార్థులతో కలిసి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. అనంతరం ఎంఈఓ -2 వీరప్రతాప్‌రెడ్డి, మోడల్‌స్కూల్ అధ్యాపక బృందం, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

బీమాతో కుటుంబానికి ఆసరా



బీమా చెక్కును అందిస్తున్న బ్యాంక్ అధికారులు

గోస్పాడు: బీమా సొమ్ము కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని ఏపీజీబీ జిల్లెల్ల శాఖ మేనేజర్ సాత్విక అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి గురువారం బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన దబ్బర జయ శంకర్ గత రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. అయితే స్థానిక ఏపీజీబీలో అకౌంట్ ఉండడంతో పాటు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా చేసి ఉండటంతో ఇందుకు సంబంధించిన రూ.2 లక్షలు చెక్కును నామినీ సిద్దమ్మకు అందజేశారు. బ్యాంకుల్లో అకౌంట్‌లు ఉన్న ప్రతి ఒక్కరు పీఎం జేజేబీవై బీమా పాలసీకి ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలని, అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు.

నేడు యోగా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీ పరిధిలో యోగాంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మండల స్థాయి మున్సిపాలిటీ లెవెల్‌లో పోటీలుంటాయన్నారు. ఆసక్తి గల వారు 10 -18 సంవత్సరాలు, 19 - 35ఏళ్లలోపు, 35 ఆపై వయస్సున్న వారు సచివాలయంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

యోగా నిత్య జీవితంలో భాగం కావాలి

నంద్యాల(న్యూటౌన్): యోగా నిత్య జీవితంలో భాగం కావాలని 9వ బెటాలియన్ గర్ల్స్ ఎన్‌సీసీ విభాగం కల్నల్ బేబి ఫిలిప్ అన్నారు. గురువారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో 200 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌తో యోగా సాధన చేయించారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

8న స్వాతి నక్షత్రవేడుకలు



శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహస్వామి

బనగానపల్లె రూరల్: స్థానిక రవ్వలకొండపై ఉన్న శ్రీ చెంచు లక్ష్మి సమేత పావన నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బాలిశెట్టి పవన నరసింహమూర్తి గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం తులసి దళాలతో అర్చన, కుంకుమార్చన తదతర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ : స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతి పాటు 7, 8, 9, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల కోసం ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 24న ప్రవేశ పరీక్ష, 25న ఎంపికైన విద్యార్థుల జాబితా, 26న ధ్రువ పత్రాలను అందజేస్తామన్నారు.

చౌక దుకాణాలు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ప్రతి వార్డులో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ..రేషన్ డెలివరీ చేసే వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందే కానీ చౌక దుకాణాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం మరిచిందని, పట్టణంలోని పలు వార్డుల్లోని ప్రజలు డెలివరీ వాహనాలు వస్తాయని ఎదురు చూస్తున్నారన్నారు. వాహనాలు రద్దు చేసిన విషయం రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు ప్రచారం చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నందమూరినగర్‌లోని 38వ వార్డు ప్రజలు వైఎస్సార్‌నగర్‌లోని రేషన్ షాపునకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి



రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు



ముకుందాపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల(న్యూటౌన్): రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ బీఎస్‌వీ రవికుమార్ సూచించారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని రైతులు,శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండించిన విత్తనాన్ని నిల్వ చేసుకోవడంలో సరైన మెలకువలను అవలంభించారు. నాణ్యమైన విత్తన ప్రాముఖ్యత, నాణ్యమైన విత్తనాన్ని విత్తుకోవడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. డాక్టర్ ఎస్.కె. గాయత్రి మాట్లాడుతూ పొలాల్లో నాణ్యమైన విత్తనాలను ఎలా పండించుకోవాలో వివరించారు. విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు మాట్లాడుతూ విత్తనోత్పత్తి గావించే రైతులకు ఖరీఫ్ పంటలు అయినా వరి, జొన్న, కొర్ర పంటల్లో రైతులు పాటించాల్సిన మెలకువలు, అధిక విత్తనోత్పత్తి, నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు వరి, జొన్న, కొత్త రకాల చిరు సంచులను రైతులకు అందజేశారు.

పంటల యాజమాన్యంపై అవగాహన

రుద్రవరం: ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో విత్తే ముందు ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, లక్ష్మీప్రియ సూచించారు. మండల పరిధిలోని చిత్రేనిపల్లె, ముకుందాపురం, తిమ్మనపల్లె గ్రామాల్లో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా పంటల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా విత్తన శుద్ధిపై వివరించారు. అనంతరం పచ్చిరొట్ట ఎరువుల వాడకం, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం, చిరు ధాన్య పంటల ఉత్పత్తి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, ఫహిమా, తబస్సుం తదితరులు ఉన్నారు.

బడ్జెట్ ప్రకారం అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న సర్పంచ్ తులసమ్మ

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, బడ్జెట్ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తొలసమ్మ తెలిపారు. గురువారం సర్పంచ్ తులసమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఇన్‌చార్జ్ ఈఓ తాహెర్ హుసేన్ అధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గత సమావేశంలో ఆమోదం పొంది పంచాయతీ పరిధిలో నిర్వహించిన పనులపై సమీక్షించారు. అనంతరం సమావేశ అజెండాలో పొందు పరచిన అభివృద్ధి పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీ నిధుల బడ్జెట్ కేటాయింపుల ప్రకారం పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో పలువురు వార్డు సభ్యులు వారి పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్, వీఆర్ఓ శారద, మహిళా పోలీసు ప్రసన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్

అవుకు: ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందని ప్రిన్సిపాల్ హెమీమా తెలిపారు. 6వ, 7వ, 8వ,9వ తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో సీట్లు ఖాళీ ఉన్నాయని ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ఈనెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25వ తేదీన విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాలను 26వ తేదీన పరిశీలిస్తామని ఆమె వివరించారు.


శిలాఫలకం ధ్వంసం



పగిలిపోయిన శిలాఫలకం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసమైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఆ వివరాలను తెలుపుతూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మహానంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు




ప్రత్యేక అలంకరణలో స్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఇసుక టిప్పర్ బోల్తా

బేతంచెర్ల : మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామ సమీపాన ఉన్న బ్రిడ్జి వద్ద గురువారం ప్రమాదవశాత్తు ఇసుక టిప్పర్ బోల్తాపడింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఇసుక లోడుతో బేతంచెర్ల వైపు వస్తున్న టిప్పర్ గోర్లగుట్ట బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దేవరంగకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో బేతంచెర్లకు తరలించారు. ఆసమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



బోల్తాపడిన ఇసుక టిప్పర్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి




మొక్క నాటుతున్న కలెక్టర్ రాజకుమారి, జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఏఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌తో పాటు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆవరణలో సుమారుగా 120 మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటి అక్కడితో వదిలేయకుండా వాటి సంరక్షణకు రోజూ కొంత సమయం కేటాయించాలన్నారు. నాటిన మొక్కలు వృక్షాలుగా పెరిగి భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. 76వ వన మహోత్సవం సందర్భంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌ను తీసుకున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాతావరణం అందిద్దాం

బొమ్మలసత్రం: ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచి భావితరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవుల మనుగడకు అవసరమయ్యే ఆహారం, ప్రాణవాయువు వృక్షాల ద్వారా అందుతుందనే విషయం అందరూ తెలుసుకోవాలన్నారు.కార్యక్రమంలో రిజర్వ్ ఎమ్‌టీ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్‌బీ సీఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యం

గోస్పాడు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తే.. ఆరోగ్యం చేకూరుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భముగా గురువారం నంద్యాల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. డాక్టర్లు సుదర్శన్ బాబు, కాంత రావు నాయక్, అంకిరెడ్డి, ప్రసన్న లక్ష్మి, భరత్ కుమార్, శ్రీజ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ, అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షించడంపై విద్యార్థులకు అవగాహన అవసరమని దీబగుంట్ల హైస్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం దీబగుంట్ల హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విశ్వనాథ్, మార్తమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు

నంద్యాల(వ్యవసాయం): పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ అని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ లక్ష్మికర్రి పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి ముక్కెర కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, తిరుపతి, రమణారెడ్డి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జీలు

గ్రంథాలయంలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయం ఆవరణలో ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి ఆర్ఈ శ్రీధర్ పాఠకులతో కలిసి పూల మొక్కలను నాటారు.అలాగే 12వ వార్డులో సచివాలయ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్, రైతు సంఘం నాయకుడు చింతల నాగకుమార్, మున్సిపల్ అధికారి వేణు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

నంద్యాల(న్యూటౌన్): పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.

4 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

ఉయ్యాలవాడ : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధి కూలీలతో కలిసి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అధికారులందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం సంబంధించి అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నెలకు ఒక సారి నిర్దేశించిన లక్ష్యం ఏ మేరకు ప్రగతి సాధించామనేది రివ్యూ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓలు రఘురామిరెడ్డి, వీరప్రతాప్ రెడ్డి, ఏపీఓ హరికృష్ణ, ఏపియమ్ దాస్, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, హెచ్ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

చాగలమర్రి: పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని చాగలమర్రి ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో సుమారు 4,500 మొక్కలు నాటినట్లు తెలిపారు. అదే విధంగా చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు వెయ్యి మొక్కలను సర్పంచ్ తొలసమ్మ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి నాటారు.

- **రుద్రవరం:** పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో, ఏపీ మోడల్ పాఠశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల స్వామి, పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.
- **దొర్నిపాడు:** ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా పెంచాలని మండల ప్రత్యేకాధికారి గోవిందనాయక్ సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సావాన్ని పురస్కరించుకొని మండలంలోని క్రిష్టిపాడు సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ సావిత్రి, సర్పంచ్ శివరామిరెడ్డి, వీఆర్ఓ సాంబశివుడు,గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసు ఏపీఓ హనీఫా పాల్గొన్నారు. అలాగే మండలంలోని డబ్బ్యా కొత్తపల్లెలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ భూమా నారాయణ రెడి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో డీఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ మొక్కను నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి వుసేని పాల్గొన్నారు.



డబ్బ్యాకొత్తపల్లెలో మొక్క నాటుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

- **శిరివెళ్ల:** మానవ మనుగడకు చెట్లే ఆధారమని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. గురువారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓ ఆర్డీ శ్రీనివాసశర్మ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ లక్ష్మీనరసింహ యాదవ్, నంద్యాల నియోజకవర్గం కో ఆర్డినేటర్ చాకలి పుల్లయ్య విమర్శించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి హాజరవుతారని తెలిపారు.

నంద్యాల నియోజకవర్గం, పార్లమెంట్ స్థాయి ముఖ్యనాయకులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, ప్రధాన కార్యదర్శి రియాజ్, రజాక్, ఉపాధ్యక్షుడు ఎస్‌వైడీ ప్రసాద్ పాల్గొన్నారు.

టీ.లింగందిన్నెలో అగ్ని ప్రమాదం



కాలి బూడిదవుతున్న పశుగ్రాసం

రుద్రవరం: మండల పరిధిలోని టీ.లింగందిన్నెలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించడంతో రేకుల షెడ్డు, వస్తు సామగ్రి కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వెంకటసుబ్బయ్య అనే రైతు తన రేకుల షెడ్డులో 250 గడ్డి చుట్టలు, 15 బస్తాల రసాయన ఎరువుల బస్తాలు నిల్వ ఉంచాడు. అయితే గుర్తు తెలియని దుండగులు గడ్డి చుట్టలకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి గడ్డి, వస్తు సామగ్రి కాలిపోయాయి. ప్రమాదంలో రైతుకు దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పనిగంటల పెంపు సరికాదు

నంద్యాల(న్యూటౌన్): లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జూలై 9న కార్మిక వర్గం దేశ వ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్న దశలో రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, బాలవెంకట్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును రాష్ట్రంలో నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని సమయం కోసం పోరాడి సాధించుకున్న కార్మిక వర్గంపై 10 గంటల పని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమన్నారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేటర్లకు లాభాలు కట్టబెట్టేందుకే కూటమి ప్రభుత్వ నిర్ణయమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు.